క్లుప్తంగా

మహిళా ఉద్యోగులకు యోగా వర్క్‌షాప్


యోగా అభ్యసిస్తున్న మహిళా ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మహిళా ఉద్యోగులకు శుక్రవారం యోగా వర్క్‌షాప్ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ విమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ (విప్స్) ఆధ్వర్యంలో ఎల్ అండ్ డీసీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ యోగా నిపుణులు మన్సీ గులాటీ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే మహిళలకు యోగాభ్యసనం అవసరమన్నారు. ఈ సందర్భంగా ఆమె పలు యోగా భంగిమలు వివరించి, వచ్చిన వారితో ప్రాక్టీస్ చేయించారు. తొలుత కార్యక్రమాన్ని వి స్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నుపుర్ భట్ ప్రారంభించారు. విప్స్ కో–ఆర్డినేటర్ కె. స్మిత చంద్రావత్ తదితరులు పాల్గొన్నారు.

సంజీవరెడ్డికి స్టీల్ ఇంటక్ అభినందనలు


ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డిని అభినందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డిని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు అభినందించారు. న్యూఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన ఐఎన్‌టీయూసీ జాతీయ ప్లీనరీ ముగింపు సమావేశాల్లో సంజీవరెడ్డిని నూతన అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రాజశేఖర్ నేతృత్వంలో నాయకులు కలిసి ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, వేతన ఒప్పందంలో జాప్యం తదితర అంశాలను సంజీవరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో భోగవిల్లి నాగభూషణం, వరహాలరాజు, గంటా కామరాజు, జి. వెంకటరావు, నడుపూరి వెంకన్న, కారు రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌క్లబ్‌లో త్యాగరాజ ఆరాధనోత్సవాలు రేపు

ఉక్కునగరం: విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా) ఆధ్వర్యంలో ఆదివారం సద్గురు త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నామని విస్కా కార్యదర్శి ఎ. కేశవరావు, స్టీల్ క్లబ్ కార్యదర్శి జి. నారాయణ దొర తెలిపారు. స్టీల్‌క్లబ్ సహకారంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో చలన చిత్ర గాయకులు, విజయనగరం సంగీత, నృత్య కళాశాల విశ్రాంత సంగీత ప్రధానాధ్యాపకులు బి.ఎ.నారాయణ, బృందంచే 'పంచరత్న సేవ, త్యాగరాజ విరచిత కృతుల నాదనీరాజనం' కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి సంగీతాభిమానులు తమ పిల్లలతో హాజరు కావాలని కోరారు.

గాంధీజీ విగ్రహానికి క్షీరాభిషేకం


మహాత్మాగాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: దల్లివానిపాలెం జంక్షన్ వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. అధికారులు గాంధీ విగ్రహాన్ని తిరిగి ఇవ్వడంపై జాగారపు శ్రీను కృతజ్ఞతలు తెలిపారు. వివరాలివి.. 2018 జనవరి 30న గాంధీ వర్ధంతి సందర్భంగా వంటిల్లు జంక్షన్ వద్ద జాగారపు శ్రీను ఆధ్వర్యంలో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే అనుమతులు లేని కారణంగా జీవీఎంసీ అధికారులు ఆ విగ్రహాన్ని తొలగించి, తమ కార్యాలయానికి తరలించారు. దీంతో ఆ విగ్రహాన్ని ఇప్పించాలని జాగారపు శ్రీను ఐదేళ్ల నుంచి విజ్ఞప్తి చేస్తున్నారు. ఎట్టకేలకు అధికారులు ఆ విగ్రహాన్ని వెనక్కి ఇచ్చేశారు. దీంతో దల్లివానిపాలెం జంక్షన్ వద్ద ఆ విగ్రహానికి ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్ రాజాన రామారావు, మార్టుపూడి పరదేశి, గొందేశి వెంకటరమణారెడ్డి, రమణ, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదింతల శ్రద్ధతో..

ప్రతీ విద్యార్థికి పదో తరగతి ఎంతో కీలకం. వారి భవితకు మేలి మలుపు, ఉన్నత శిఖరాల అధిరోహణకు తొలి మెట్టు. అందువల్ల టెన్త్ క్లాస్ అనగానే పిల్లల్లోనూ టెన్షన్ మొదలైపోతుంది. అయితే, ఒత్తిడిని దరి చేరనివ్వకుండా, ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలను సాధించగలుగుతారు. పరీక్షల సన్నద్ధత అంశాన్ని తీసుకుంటే, విద్యార్థులు ఇప్పటి వరకు చదివింది ఒక ఎత్తు.. ఇక్కడి నుంచి పరీక్షల కోసం సిద్ధం కావడం మరో ఎత్తు. ప్రణాళిక ప్రకారం చదివితే పదికి పది పాయింట్లు సాధించడం పెద్ద కష్టమేం కాదు. ఈ ఏడాది ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నారు. వంద రోజుల ప్రణాళికపై జిల్లా విద్యా శాఖాధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు.


నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయులు

- శత శాతం ఉత్తీర్ణతకు వందరోజుల ప్రణాళిక
- టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ
- శని, ఆదివారాల్లోనూ బోధన
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

పెదగంట్యాడ: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు జిల్లా విద్యాశాఖాధికారుల ఆదేశానుసారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక చర్యలు చేపట్టారు. మండలంలోని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వందరోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారిస్తున్నారు. ఏ సబ్జెక్టుల్లో మార్కులు తగ్గుతున్నాయో గుర్తించి, ప్రత్యేకంగా బోధన సాగిస్తున్నారు. ప్రత్యేక తరగతుల్లో ప్రతి విద్యార్థిని లక్ష్యంగా చేసుకుని ఆయా ఉపాధ్యాయులు సిద్ధం చేస్తున్నారు.

పది సూత్రాలు

పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కలెక్టర్, జిల్లా విద్యా శాఖాధికారి ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. పదో తరగతికి పది సూత్రాలను అమలు చేస్తున్నారు. మండల విద్యా శాఖాధికారులు, ఉప విద్యా శాఖాధికారులు, ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో సూక్ష్మ ప్రణాళిక రూపొందించి, శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నారు.

100 రోజుల ప్రణాళిక

డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ (డీసీఈబీ) ఆధ్వర్యంలో 100 రోజుల ప్రణాళికను తయారు చేశారు. ఏ రోజు ఏ సబ్జెక్ట్, ఏ చాప్టర్ చదవాలనే దానిపై ప్రణాళిక సిద్ధం చేశారు. దీనిని పాఠశాలలకు పంపించి అమలు చేస్తున్నారు. దీనిపై జిల్లా విద్యా శాఖాధికారి, ఉప విద్యాశాఖాధికారి, డైట్ ప్రిన్సిపాల్ బృందంగా ఏర్పడి వెబ్‌ఎక్స్‌ల ద్వారా అవగాహన కల్పిస్తూ ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. అన్ని విభాగాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ప్రత్యేకంగా మోడల్ ప్రశ్నాపత్రాలతో కూడిన డీసీఈబీ పుస్తకాలను పంపిస్తున్నారు. ప్రతి శని, ఆదివారాలతో పాటు సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.

ఒత్తిడి తగ్గించేందుకు కౌన్సెలింగ్

విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు పరీక్షలను సులభంగా రాసేందుకు వీలుగా మానసిక శాస్త్ర నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. మారిన పరీక్ష విధానం, ప్రశ్న పత్రాలపై విద్యార్థులను సన్నద్ధం చేసేలా తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పరీక్షల హాజరయ్యే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

గ్రాండ్ టెస్ట్, ప్రత్యేక పరీక్షలు

ఎస్ఏ, ఎఫ్ఏ తో పాటు ఈ నెల 24 నుంచి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల కోసం ఏబీసీడీ గ్రేడులతో గ్రాండ్ టెస్ట్, ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీరికి ఉచితంగానే ప్రశ్న పత్రాలను అందజేస్తున్నారు.

నైట్ విజిట్స్

నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లను రాత్రి పూట విజిట్ చేస్తున్నారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు ఎలా చదువుతున్నారో ఆరా తీస్తున్నారు.

అల్పాహారం అందజేత

ఎక్కువ సమయం పాఠశాలలో ఉండే విద్యార్థుల కోసం నడుపూరు హైస్కూల్‌లో కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో సాయంత్రం అల్పాహారం అందజేస్తున్నారు.

విద్యార్థుల దత్తత

పాఠశాలలో పని చేసే ప్రతి ఉపాధ్యాయుడు చదువులో వెనుకబడిన వారితో పాటు 500 మార్కులు దాటే విద్యార్థులను దత్తత తీసుకుని ప్రత్యేక శ్రద్ధతో పటిష్టమైన ప్రణాళికతో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తున్నారు.

గతేడాది 82శాతం ఉత్తీర్ణత

నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు యారాడ పాఠశాలలో గతేడాది పదో తరగతిలో 82శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇస్లాంపేట పాఠశాలలో 85శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు.


యారాడ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


ఇస్లాంపేట పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు


విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయుడు

పైడిమాంబ ఆలయ ముఖద్వారం ప్రారంభం


ఆర్చిని ప్రారంభించిన దాతలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి ముఖద్వారాన్ని శుక్రవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన దాతలు విందుల సతీష్, శంకరరావు తమ తండ్రి తాతారావు జ్ఞాపకార్థం దీనిని నిర్మించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు విందుల నారాయణరావు, అమరపిని గోవింద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ ఆలయాల కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు నెల్లి శ్రీనివాసరావు, మోటూరి వెంకటరమణ, బలిరెడ్డి సత్యనారాయణ, కొయ్య రమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ, కొలిపాక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగం

అక్కిరెడ్డిపాలెం: డిగ్రీ పాసైన నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడ్‌స్కిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. హెల్త్ కేర్ బిల్లింగ్, హాస్పిటల్ ఫ్రంట్ డెస్క్ కో–ఆర్డినేటర్, పేషెంట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గలిగి, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 27 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, శిక్షణ అనంతరం కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలియజేశారు. ఇతర వివరాలకు షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో నేరుగా లేదా 72079 53919, 76708 58199, 76809 45357 నంబర్ల ద్వారా ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

బోధనా విధానాలపై ముగిసిన శిబిరం


నిట్ ప్రొఫెసర్ శివకుమార్‌ను సత్కరిస్తున్న రెక్టార్ మధుసూదనరావు

అగనంపూడి: నూతన బోధనా విధానాలపై అధ్యాపకులకు దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. 21వ శతాబ్దపు అధ్యాపకుల నూతన బోధనా విధానాలపై విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటీటీటీఆర్, చెన్నై) సంయుక్తంగా ఐదు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్ వి.శివకుమార్, వినోద్‌కుమార్ మాట్లాడుతూ అధ్యాపకులు అనుభవంతో పాటు విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక రంగాలను సమన్వయం చేసుకుని విలువల ఆధారిత విద్యను అందివ్వాలన్నారు. 40 దేశాల్లో అనుసరిస్తున్న బోధనా పద్ధతుల గురించి విశదీకరించారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, డాక్టర్ కె.ఎస్.గిరిధరన్, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, డీన్లు హరగోవిందరావు, నాగజ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. బీజేపీ మద్దతు అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు శుక్రవారం గాజువాకలో ప్రచారం నిర్వహించారు. గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, ఎన్నికల ఇన్‌చార్జి కోడూరి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో గాజువాక హైస్కూల్ రోడ్‌లోని విద్యా సంస్థల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి, తమ పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ మద్దతు అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంపాడ చిరంజీవిరావు శుక్రవారం ప్రచారం చేశారు. ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద విధులకు వెళ్తున్న ఉద్యోగులను కలిసి, తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యాయమూర్తి శ్రీవిద్యకు సత్కారం


న్యాయమూర్తి శ్రీవిద్యను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

గాజువాక : శ్రీకాకుళం మొబైల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులైన సీహెచ్.శ్రీవిద్యను గాజువాక బార్ అసోసియేషన్ సంఘం ప్రతినిధులు శుక్రవారం సత్కరించారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 13వ అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్, న్యాయమూర్తులు ఎస్.శ్రీవిద్య, రాజేంద్రబాబు, వై.శ్రీలక్ష్మి తదితరులు ఆమెను అభినందించారు. సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ గాజువాక న్యాయవాద సంఘం సభ్యుడు చినగొడబ తిరుమలరావు కుమార్తె, న్యాయవాది శ్రీవిద్య న్యాయమూర్తిగా నియమితులు కావడం హర్షణీయమన్నారు. వచ్చేనెల 1వ తేదీన బాధ్యతలు చేపట్టనున్న ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మేకా పట్టాభి రామారావు, ఎం.ఈశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు వెన్నల ఈశ్వరరావు, కె.ఎస్.ఎన్.మూర్తి, కోలా వెంకట రమణ, బసా అప్పలరెడ్డి, ఎం.శాంతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పోరాటం అద్వితీయం

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు


దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘంగా పోరాటాలు చేస్తున్న కార్మికులు అభినందనీయులని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం జంక్షన్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 743వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో స్టీల్ ప్లాంట్ ఎల్ఎంఎంఎం, ఎస్టీఎం విభాగాల ప్రతినిధులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను సమర్థిస్తున్న సమయంలో, కార్మికుల నుంచి ఇటువంటి ప్రతిఘటనను ఎదుర్కోవడం ఆ పార్టీ నేతలకు మింగుడుపడడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎలాగైనే విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలని చూస్తోందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అన్ని రాజకీయ పక్షాలను ఏకం చేయడం ద్వారా, దానిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం వామపక్షాలు పోరాటాలు చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ప్రతినిధులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, కె.సత్యనారాయణరావు, రామస్వామి, వై.టి. దాస్, సంపూర్ణం, సీహెచ్ సన్యాసిరావు, సురేష్‌బాబు, సుబ్బయ్య, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'నామాల' నియామకం


నామాల పెంటయ్య

పెదగంట్యాడ: అఖిల భారత పద్మశాలి సీడబ్ల్యూసీ మెంబర్‌గా నామాల పెంటయ్య నియమితులయ్యారు. ఈ మేరకు అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగంట్ల స్వామి నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కుకు చెందిన పెంటయ్య పెదగంట్యాడ మార్కండేయ సంఘం గౌరవాధ్యక్షునిగా, విశాఖ జిల్లా పద్మశాలి ఎంప్లాయిస్ సంఘం ఉపాధ్యక్షునిగా, జిల్లా సంఘం కార్యదర్శిగా సేవలందిస్తున్నారు.

ఫిర్యాదులన్నీ అక్రమ, అనధికార కట్టడాలపైనే..

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ స్పందన


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న పట్టణ ప్రణాళికాధికారి సురేష్‌కుమార్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ అన్ని జోన్లలో చేపడుతున్న నిర్మాణాలపై పట్టణ ప్రణాళికా విభాగం శుక్రవారం స్పందన నిర్వహించింది. అక్రమ.. అనధికార కట్టడాలపైనే ఫిర్యాదులన్నీ వచ్చాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. వాటి వివరాలిలా.. జోన్–1 నుంచి భీమిలి చిట్టివలసకు చెందిన జి.శ్రీనివాసరావు జోన్ పరిధిలో అక్రమ, అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేయగా.. భీమిలికి చెందిన ఎస్.ఆర్.రాజా సంగివలస అనిట్స్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. జోన్–3 నుంచి పాత రేసపువానిపాలేనికి చెందిన హితేష్‌కుమార్ జైన్ టీడీఆర్ సరిఫికెట్ కోసం, నక్కవానిపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని అదే ప్రాంతానికి చెందిన కర్రి గణపతి, శివాజీపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని పి.ఎల్.వి.ఎన్.మూర్తి, పెదవాల్తేరుకు చెందిన తెడ్డు శంకరరావు ఫిర్యాదు చేశారు. జోన్–4 నుంచి 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్ సూర్యాబాగ్ లైన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని, ఎటువంటి సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మిస్తున్నారని, రెసిడెన్షియల్ ఏరియాలో కమర్షియల్ బిల్డింగ్స్ కడుతున్నారని ఫిర్యాదు చేశారు. జోన్–5 నుంచి సనపల నాగచంద్రుడు జోన్ పరిధిలో అక్రమ బిల్డింగ్ నిర్మాణాలకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఎలా అనుమతులు ఇచ్చిందని, జోన్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని తాటిచెట్లపాలేనికి చెందిన చిల్లా వెంకటస్వామి, దయాల్‌నగర్ నుంచి జె భువనేశ్వరిదేవి జోన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య రత్నకుమార్, నరేంద్రనాథ్‌రెడ్డి, కె.పద్మజ, ఏసీపీలు, టీపీవో, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ నిర్వాకం

హాల్ టికెట్లు అందక పరీక్ష రాయలేకపోయిన ఇద్దరు విద్యార్థులు


పరీక్ష కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పెదగంట్యాడ: ఓ ప్రైవేటు స్కూల్ నిర్వాకం ఇద్దరు విద్యార్థులకు శాపంగా మారింది. లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించినప్పటికీ ఆఖరి నిమిషంలో హాల్ టికెట్లు అందకపోవడంతో వారిద్దరూ పరీక్ష రాయలేకపోయారు. పెదగంట్యాడ వుడా కాలనీలోని టింపనీ స్కూల్ వద్ద శుక్రవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. భీమిలి క్రాస్ రోడ్డులోని ది హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 43 మంది పదో తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ పరీక్ష రాసేందుకు టింపనీ స్కూల్‌కు వచ్చారు. అందులో బొబ్బిలికి చెందిన బి.సాయి దుర్గ హర్షవర్ధన్, నర్సీపట్నానికి చెందిన సూరిశెట్టి తరుణ్‌లకు హాల్ టికెట్లు అందజేయకపోవడంతో పరీక్షా కేంద్రం నుంచి ఉసూరుమంటూ బయటకు వచ్చేశారు. వెంటనే సంబంధిత పాఠశాలను సంప్రదిస్తే పరీక్ష సమయానికి వస్తాయని చెప్పడంతో వారు వేచి చూశారు. ఎంత సేపటికీ హాల్ టికెట్లు రాకపోవడం, తోటి విద్యార్థులంతా పరీక్ష కేంద్రంలోకి వెళ్లడంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇది గమనించిన వారిద్దరి తల్లిదండ్రులతోపాటు మిగిలిన విద్యార్థుల పేరెంట్స్ ఆందోళనకు దిగారు. అక్కడికి వచ్చిన హార్బర్ స్కూల్ కరస్పాండెంట్ వైఎస్ నాయుడును నిలదీశారు. తమ పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకున్నారంటూ ఆవేదన చెందారు. సాంకేతిక కారణాల వల్లే ఆ ఇద్దరి విద్యార్థులకు సమయానికి హాల్ టికెట్లు ఇవ్వలేకపోయమని పాఠశాల యాజమాన్య ప్రతినిధులు చెప్పడంతో వారంతా ఆగ్రహానికి లోనయ్యారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. న్యూపోర్టు పోలీసులు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకుని తల్లిదండ్రులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

బ్యాడ్మింటన్‌లో త్రిషాలి, శ్రీకృష్ణకు స్వర్ణాలు


వితోలి బ్యాడ్మింటన్ విజేతలు

విశాఖ స్పోర్ట్స్: అమరావతి వీఐటీలో నిర్వహించిన వితోలి బ్యాడ్మింటన్ టోర్నీలో జి.త్రిషాలి వుమెన్ సింగిల్స్‌లో విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో పి.వి న్సీ(కె.ఎల్.యూ)పై 21–8, 21–8 పాయింట్ల తేడాతో విజయం సాధించి స్వర్ణాన్ని అందుకుంది. మెన్ ఫైనల్ సింగిల్స్‌లో శ్రీకృష్ణ 2–0 సెట్ల తేడాతో యశ్వంత్ (కె.ఎల్.యూ)పై, డబుల్స్‌లో ఎ.రూపేష్‌తో కలిసి స్ట్రయిట్ సెట్లలోనే సుల్తాన్–ఆదిత్య(వీఐటీ)జోడీపై విజయం సాధించి స్వర్ణాలందుకున్నారు. గీతం విద్యార్థులైన వీరంతా నాలుగు కేటగిరీల్లో పాల్గొని మూడు పతకాలు సొంతం చేసుకున్నారు.

అప్పుల బాధ తాళలేక యువకుడి బలవన్మరణం


నీలి మోహనకృష్ణ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఘటనకు సంబంధించి గాజువాక ఎస్ఐ ఎం.రవికుమార్, మృతుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాలివి.. భెల్ టౌన్ షిప్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న నీలి భావనారుషి, పార్వతి దంపతుల కుమారుడు మోహన కృష్ణ (28). వీరు భెల్ టౌన్‌షిప్ క్వార్టర్ ఎఫ్ – 65లో నివాసం ఉంటున్నారు. మోహన కృష్ణ వ్యాన్ కొనుక్కుని, స్వయంగా నడుపుకొనేవాడు. ఈ క్రమంలో 69వ వార్డు తుంగ్లాంకు చెందిన వాకాడ శ్రీనివాసరెడ్డి వద్ద రూ.40వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని నిత్యం వేధిస్తుండటంతో, గురువారం అర్ధరాత్రి తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో వేరే గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ ఎం.రవికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అధిక వడ్డీలతో వేధింపులకు గురి చేస్తాడని శ్రీనివాసరెడ్డిపై ఎన్నో ఆరోపణలున్నాయని గ్రామస్తులు తెలిపారు. అతని వేధింపుల వల్లే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అందివచ్చిన కొడుకు తనువు చాలించడంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు.

నైపుణ్య సాధనతో ఉన్నతావకాశాలు


ప్రొఫెసర్ సాంబశివరావును సత్కరిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్(విశాఖ ఉత్తర): విద్యార్థులు వారు చదువుతున్న కోర్సుకు సంబంధించిన నైపుణ్యాలు సాధించినప్పుడే ఉన్నత అవకాశాలు పొందుతారని ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ) జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో ఐఎస్‌టీడీ ఆధ్వర్యంలో శుక్రవారం నైపుణ్యాభివృద్ధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఎస్‌టీడీ గౌరవ కార్యదర్శి డాక్టర్ వై.హేమ విద్యార్థులకు ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్ విధివిధానాలను వివరించారు. స్టీల్‌ప్లాంట్ పూర్వ జనరల్ మేనేజర్ డాక్టర్ ఒ.రామమోహనరావు సాంకేతిక అంశాలపై ప్రసంగించారు. అనంతరం ప్రొఫెసర్ సాంబశివరావును సత్కరించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ సీఈవో పి.సునీల్, కాలేజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, డి.దామోదరరావు, ఎస్.ప్రశాంతకుమారి, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు సర్దుబాటు కౌన్సెలింగ్

మహారాణిపేట: జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ(జీఎన్ఎం) ఉత్తీర్ణత సాధించి ఆక్సిలరీ నర్సింగ్ మిడ్ వైఫరీ (ఏఎన్ఎం)గా పనిచేస్తున్న వారికి శుక్రవారం సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంఈ, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ఉమాసుందరి ఈ ప్రక్రియ చేపట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొత్తం 195 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తామని ఆర్డీ తెలిపారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తామన్నారు.